వీరోచిత యోధుడు వడ్డె ఓబన్న

నివాళులర్పించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి

వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 11: వీరోచిత యోధుడు వడ్డె ఓబన్న ఆశయాలను కొనసాగించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వడ్డె ఓబన్న జయంతోత్సవాన్ని అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి, వడ్డె ఓబన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందరికీ స్వేచ్ఛ, సమానత్వం, గౌరవం కల్పించాలనే ఆశయంతో పోరాడిన స్వతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న అని అన్నారు. వడ్డేర సంఘం జిల్లా అధ్యక్షుడు లింగయ్య మాట్లాడుతూ వడ్డెర కులస్తుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సహాయ బీసీ సంక్షేమాధికారి కె భగ్యలక్ష్మి, వడ్డెర కుల సంఘ నాయకులు పల్లపు అంజయ్య, వీఎంఎల్ చక్రవర్తి, శ్రీనివాస్, జైరాం, ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్నను ఆదర్శంగా తీసుకోవాలి

ఆర్సీపురంలో వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్, జిల్లా అధ్యక్షుడు లింగయ్య

రామచంద్రాపురం,జనవరి11 : వడ్డె ఓబన్న పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపెటి జైపాల్ అన్నారు. ఆర్సీపురం డివిజన్‌లోని వడ్డెర బస్తీలో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు వరికుప్పల లింగయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపెటి జైపాల్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డెర కులస్తులందరూ వడ్డె ఓబన్నను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు లింగయ్య మాట్లాడుతూ వడ్డెరులంద రూ ఐక్యమత్యంగా ఉండి మన హక్కుల సాధన కోసం పోరాడాలని సూచించారు. నాయకులు శ్రీరాములు, సాయికుమార్, నర్సింహులు, అంజయ్య, ముత్యాలు, ఎల్లయ్య, సిద్ధయ్య, పెద్దులు పాల్గొన్నారు.

బొల్లారంలో కాషాయ జెండాలతో భారీ ర్యాలీ

బొల్లారంలో కాషాయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జిన్నారం (బొల్లారం) జనవరి 11 : అయోధ్యలో నిర్మించిన రామ మందిరం తొలి వార్షికోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని బొల్లారం మున్సిపాలిటీలో హిందూ ధర్మ ప్రచార సమితి సభ్యులు, మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో వేర్వేరుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మ ప్రచార సమితి సభ్యులు, యువకులు, నాయకులు కాషాయ జెండాలు పట్టి హనుమాన్ ఆల యం నుంచి గాంధీనగర్ రామ మందిరం వరకు నిర్వహించిన ర్యాలీలో జైశ్రీరామ్ నినాదాలతో వీధులు దద్దరిల్లిపోయాయి. అనంతరం స్థానిక రామ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ జరిగి తొలి వార్షికోత్సవాన్ని జరుపుకోవడంపై మున్సిపల్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నాయకులు, యువకు లు, ధర్మ ప్రచార సమితి సభ్యులు, మహిళ లు, పాల్గొన్నారు.

పద్మశాలీ సేవా సమాజం క్యాలెండర్ ఆవిష్కరణ

పద్మశాలీ సేవా సమాజం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, జనవరి 11 : పద్మశాలీ సేవా సమాజం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ స్థానిక చేనేత సహకార సంఘం భవనంలో శనివారం ఆవిష్కరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శివరాజ్‌పాటిల్, మాజీ కౌన్సిలర్ సాతాని శ్రీశైలం, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శ్రీదర్ రెడ్డి, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చింతా ఆనంద్, సభ్యులు పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొన్న లారీ

తండ్రి మృతి, కుమారుడికి తీవ్రగాయాలు

పటాన్‌చెరు, జనవరి 11 : నందిగామలో రహదారిపై తండ్రీ కొడుకులు ప్రయాణిస్తున్న స్కూటీని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో తండ్రి అక్కడికక్కడే మృతిచెందగా, కొడుకుకు తీవ్రగాయాలయ్యాయి. బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన అశోక్ (45), కుమారుడు మణి సంకిత్ (20) శనివారం రాత్రి పటాన్‌చెరు వైపు శంకర్‌పల్లి నుంచి వెళ్తున్నారు. అయితే నందిగామ గ్రామానికి చేరుకోగానే ఎదురుగా వస్తున్న లారీ వీరి స్కూటీని ఢీకొన్నది. దీంతో తండ్రి అశోక్ సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. కుమారుడు మణిసంకిత్‌కు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చైనా మాంజా.. యమడేంజర్

- నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తే అరెస్టులే
- బృందాలతో పోలీసుల ప్రత్యేక నిఘా
- దుకాణా సముదాయాల్లో తనిఖీలు
- ప్రజలకు, పర్యావరణానికి నష్టం కలిగించొద్దు
- సంక్రాంతిని ఆనందంగా జరుపుకొందామని పోలీసుల పిలుపు

జిన్నారం(బొల్లారం) జనవరి 11: ఓపక్క చైనా వైరస్ హెచ్ ఎంపీవీ భయపడుతుంటే మరోపక్క చైనా మాంజా విక్రయాలు హడలెత్తిస్తున్నాయి. ఏటా సంక్రాంతి సీజన్‌లో చిన్నా పెద్దా తేడా లేకుండా ఆనందంగా పతంగులు ఎగరేస్తారు. కానీ, పతంగులు ఎన్ని ప్రాణాలను బలితీస్తున్నాయో తలుచుకుంటే బాధేస్తోంది. పతంగులు కాగితంతోనే చేస్తారు కావచ్చు. కానీ, దాన్ని ఎగరేసే దారం విషయంలో మాత్రం చాలామంది చైనా మాంజాను వాడుతున్నారు.

చైనా మాంజా యమడేంజర్..

గతంలో పెద్ద పతంగులు ఎగరేయడానికి చైనా మాంజాలు వాడేవారు. వాటిని నైలాన్‌తో తయారు చేస్తారు. మాంజాకు గాజు పొడి పూసిన నైలాన్, సింథటిక్ ధారాలు మాంజా తయారీలో వాడతారు. క్రమంగా చిన్నచిన్న పతంగ్ లకు కూడా చైనా మాంజాలు వాడడం స్టార్ట్ చేశారు. వేరే పతంగ్ ధారానికి వెలిక వేసి పడగొట్టడానికి.. ధారం తెగిపోకుండా ఉండటానికి ఈ చైనా మాంజాలు యూజ్ చేస్తుంటారు. చైనా మాంజా అసలు తెగదు. గాలిపటం ఎగరేసినప్పుడు పొరపాటున ధారం వదిలేయడం, వేరేవాళ్లే మాంజాధారం తెంపడం జరుగుతుంది. అది చెట్లు, బిల్డింగుల మధ్య చిక్కుకొని బైక్‌పై రోడ్డు మీద వెళ్లేవారి మెడకు చుట్టుకొని ఆ వేగానికి గొంతు కోసుకుపోతుంది. ఇలా చైనా మాంజాలు చాలామంది బైకర్స్ మెడకు ఉరితాడై.. పండగపూట విషాదాలు మిగిల్చాయి. చాలా పక్షులు మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి.

చైనా మాంజా అమ్మినా... కొనుగోలు చేసినా నేరమే..

రాష్ట్ర ప్రభుత్వం జనవరి 2016లోనే చైనా మాంజా అమ్మకాలను నిషేధించింది. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం చైనా మాంజాను కొనుగోలు చేసినా.. అమ్మినా నేరం. దీనిని ఉల్లంఘించిన వారికి ఐదేండ్లు, అంతకన్నా ఎక్కువ జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారు. పక్షులు, జంతువులకు హాని కలిగిస్తే వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం 3 నుంచి ఏడేండ్ల జైలు శిక్ష, రూ.10,000 జరిమానా విధిస్తారు.

నిషేధిత చైనా మాంజా విక్రయాలు చేపడుతున్న దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ రవీందర్‌రెడ్డి

మాంజాపై నిషేధాజ్ఞలు పాటించాలి..

జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ ఆదేశాల మేరకు బొల్లారం మున్సిపాలిటీలో మూడు బృందాలను ఏర్పాటు చేసి రోజువారీగా దుకాణాల్లో తనిఖీలను చేపడుతున్నాం. ఇప్పటికే ముగ్గురు చైనా మాంజా విక్రయదారులను అరెస్టు చేసి కేసులు నమోదు చేశాం. సామాన్య ప్రజలకు, వాహనదారులకు, పర్యావరణంలోని పశుపక్షాధ్యులకు నష్టం కలిగించేలా ప్రవర్తిస్తే తక్షణ చర్యలు తీసుకుంటాం. చైనా మాంజాను ఎవరైనా వర్తకులు,ఇతరులు అమ్మకాలు చేసి నా, కొనుగోలు చేసినా అవసరమైతే కేసులు నమోదు చేసి జైల్లో పెడతాం. నిబంధనలను ఉల్లంఘించడం నేరంతో సమానం. వర్తకులు, కొనుగోలుదారులు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలి. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకొందాం.

– రవీందర్‌రెడ్డి , సీఐ బొల్లారం

పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు

సదాశివపేట : శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో ముగ్గుల పోటీల విజేతలతో మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ శివరాజ్‌పాటిల్, పాఠశాల సిబ్బంది

సంగారెడ్డి కలెక్టరేట్ : విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

గుమ్మడిదల :అన్నారం శాంతివిద్యానికేతన్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సంగారెడ్డి పట్టణంలో సంక్రాంతి సంబురాల్లో పాల్గొన్న యువత

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పలు పాఠశాలల్లో శనివారం ముందస్తు వేడుకలు నిర్వహించారు. ముగ్గుల పోటీలకు, పతంగుల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

– సంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, జనవరి11

బద్రిగూడెంలో క్రికెట్ పోటీలు ప్రారంభం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై క్రాంతికుమార్ పాటిల్

చౌటకూర్, జనవరి 11 : మండలంలోని బద్రిగూడెంలో సుల్తాన్‌పూర్ ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) సీజన్ 5 క్రికెట్ క్రీడోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ క్రికెట్ క్రీడోత్సవాలను పుల్కల్ ఎస్సై క్రాంతికుమార్ పాటిల్, బీఆర్ఎస్ ఉమ్మడి పుల్కల్ మండల సీనియర్ నేత పటోళ్ల విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువత విభాగం చౌటకూర్ మండలం అధ్యక్షుడు బండ్ల విఠల్‌రెడ్డి, పటోళ్ల మహేందర్‌రెడ్డి అధ్వర్యంలో వారం రోజుల పాటు ఈ క్రికెట్ క్రీడోత్సవాలు కొనసాగనున్నాయి. సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని ఏటా ఈ క్రికెట్ క్రీడోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగానే ఈ ఏటా కూడా సీజన్ 5 పేరుతో పోటీలు నిర్వహించేందుకు ముందుకు వచ్చారు. ఈ క్రీడల్లో సుల్తాన్‌పూర్, కోర్పోలు, సరాఫ్‌పల్లి, ఉప్పరిగూడెం, బద్రిగూడెం, శేరిరాంరెడ్డిగూడెం గ్రామాలకు చెందిన యువకులు మాత్రమే పాల్గొంటారు. దాదాపుగా 200 మంది యువకులు పాల్గొనే ఈ పోటీల్లో యువత పాల్గొని తమ ప్రతిభను కనబర్చనున్నారు.

సదాశివపేటలో..

బ్యాటింగ్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు చింతా సాయినాథ్

సదాశివపేట, జనవరి 11 : మండల పరిధిలోని వెల్టూర్‌లో పీఏసీఎస్ చైర్మన్ పబ్బతి రత్నాకర్ తండ్రి పబ్బతి నర్సింహారెడ్డి స్మార్కార్థం ఏర్పాటు చేసిన టెన్నిస్ బాల్, క్రికెట్ టోర్నమెంట్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతా సాయినాథ్ శనివారం ప్రారంభించారు. అనంతరం బ్యాటింగ్ చేసి అందరినీ అలరించారు. క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ తొంట యాదమ్మ కిష్టయ్య, బీఆర్ఎస్ నాయకులు సలావుద్దీన్, చోటు, గడ్డ మీది సత్యనారాయణ, తొంట రాజు, పాండు, శ్రీను, యాదయ్య, సురేశ్, వేణు, శ్రీకాంత్‌పాటిల్, శ్రీకాంత్‌గౌడ్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా ఓపెన్ టూ ఆల్ క్రీడాపోటీలు

గుమ్మడిదలలో ఓపెన్ టూ ఆల్ క్రీడోత్సవాల్లో కబడ్డీ క్రీడాకారులకు కరాచలనం చేస్తున్న అదనపు ఎస్పీ సంజీవరావు

గుమ్మడిదల, జనవరి 11: స్వామివివేకానంద జయంతిని పురస్కరించుకుని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి సీజీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టూ ఆల్ క్రీడోత్సవాల్లో యువక్రీడాకారులు పోటాపోటీగా రాణిస్తున్నారు. కబడ్డీని వీక్షించేందుకు సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు క్రీడాదుస్తులతో హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు. క్రీడాకారులతో కరాచలనం చేసి ఉత్సాహం నింపారు. శనివారం కబడ్డీ, వాలీబాల్ ఓపెన్ టూ ఆల్ క్రీడోత్సవాలు రెండోరోజు అలరించాయి. సీజీఆర్ ట్రస్ట్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీజడ్పీటీసీ కుమార్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆలయకమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆందోళన

హత్నూర, జనవరి 11 : పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్‌చేస్తూ హత్నూర మండలం బోర్పట్ల మిషన్ భగీరథ ఫిల్టర్‌బెడ్ వద్ద శనివారం మిషన్ భగీరథ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. చెల్లించే అరకొర వేతనాలు సైతం సకాలంలో చెల్లించకపోతే కుటుంబాలను ఎలా పోషించుకునేదని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికులు జక్కులబాబయ్య, లక్ష్మన్, కుమారస్వామి, రాజు, రవి, నవీన్, విష్ణు, సత్యనారాయణ, రవీందర్, శ్రీకాంత్, విష్ణువర్ధన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బోర్పట్ల మిషన్ భగీరథ ఫిల్టర్‌బెడ్ వద్ద ఆందోళన చేపట్టిన కార్మికులు

గాలిపటాల కోసం వచ్చి.. మృత్యు ఒడికి

శ్రీరామ్ మృతదేహం

అందోల్, జనవరి 11 : గాలిపటాల కోసం వచ్చిన బాలుడు మృత్యు ఒడికి చేరాడు. దీంతో పండుగ పూట ఆ బాలుడి ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. ప్రమాదానికి సంబంధించి జోగిపేట ఎస్సై పాండు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా టేక్మాల్‌కు చెందిన నీరుడి శ్రీరామ్ (9) మరికొంత మంది పిల్లలతో గాలిపటాల కోసం శనివారం జోగిపేటకు వచ్చాడు. గాలిపటాలు కొనుక్కొని ఇంటికి వెళ్తేందుకు బస్టాప్‌కు వెళ్తున్న సమయంలో చౌటకూర్ వైపునకు వెళ్తున్న ట్రాక్టర్ బాలుడిని ఢీకొట్టడంతో కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాలుడు మృతి చెందాడు. బాలుడు ట్రాక్టర్ కింద పడడంతో మిగతా పిల్లలు భయంతో ఇంటికి వెళ్లడంతో రాత్రి వరకు మృతి చెందిన బాలుడి వివరాలు తెలియలేదు. దీంతో పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా వివరాలు సేకరించి బాలుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాలుడి తండ్రి గతంలోనే మృతి చెందగా, శనివారం బాలుడు మృతి చెందడంతో తల్లి బోరున విలపించింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు జోగిపేట ఎస్సై పాండు తెలిపారు.

బస్సులులేక.. ప్రయాణికుల ఇక్కట్లు

సంగారెడ్డి బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

సంగారెడ్డి జిల్లాకేంద్రంలో శనివారం పండుగకు ఊరెళుదామంటే సరైన బస్సులు లేక ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడ్డారు. దీంతో ప్రవేటు వాహనాలను ఆశ్రయించారు. వచ్చిన బస్సులు ప్రయాణికులతో కిక్కిరిపోయాయి.

–సంగారెడ్డి జిల్లా ఫొటోగ్రాఫర్, జనవరి 11

అధిక సంఖ్యలో బస్సు ఎక్కడానికి గుమ్మిగూడిన ప్రయాణికులు

బస్సులు లేక ప్రవేట్ వాహనాల్లో వెళ్తున్న ప్రయాణికులు

వైద్యశిబిరం విజయవంతం

నాగల్‌గిద్ద, జనవరి 11: మండలంలోని కరస్‌గుత్తి గ్రామంలో బిగ్ టీవీ, అంబేద్కర్ పూలే సేవా సమితి, ఆధ్వరంలోని శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లా ప్రణాళిక మాజీ సంఘం సభ్యుడు నగేశ్ షెట్కార్ ముఖ్య అతిథిగా పాల్గొన్ని శిబిరాన్ని ప్రారంభించారు. ఉచిత క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందించడం అభినందనీయమన్నారు. సంఘం సభ్యులు అబ్దుల్ రహీం, పండరి, తదితరులు ఉన్నారు

నేడు పద్మశాలీ భవన్‌లో రక్తదాన శిబిరం

జహీరాబాద్, జనవరి 11 : జహీరాబాద్ పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో ఆదివారం మహారక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు పట్టణ పద్మశాలీ యువజన సంఘం నాయకులు తెలిపారు. వివేకనంద స్వామిజయంతి, యువజన వారోత్సవాల్లో భాగంగా స్థానిక పద్మశాలీ భవన్‌లో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం ఒకటి వరకు రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు శిబిరంలో పాల్గొని ప్రాణదాతలుగా కావాలని సూచించారు.

రేపు పెద్దగోపులారంలో కబడ్డీ పోటీలు

మునిపల్లి, జనవరి 11 : మండల పరిధిలోని పెద్దగోపులారంలో రేపు, 13న ఒక్క రోజు ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ టోర్నమెంట్ నిర్వాహకులు తెలిపారు. శనివారం మండలంలోని బుదేరా చౌరస్తాలో స్థనిక విలేకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వహకులు మాట్లాడుతూ మండల పరిధిలోని పెద్దగోపులారం గ్రామంలో నిర్వహించే ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీల్లో ఆసక్తి గల జట్ల సభ్యులు తమ.. తమ జట్ల పేర్లను నమోదు చేసుకునేందుకు నేడు చివరి రోజు అని తెలిపారు. జట్టులో పేరు నమోదు చేసుకోవడానికి రూ. 800 చెల్లించి తమ జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కబడ్డీ టోర్నమెంట్లో పాల్గొని విజయం సాధించిన జట్టుకు నగదు రూ. 20 వేలతో పాటు బహుమతి, ద్వితీయ స్థానం సాధించిన జట్టుకు నగదు రూ.10 వేలతో పాటు బహుమతి ఉంటుందని టోర్నమెంట్‌లో ఉత్తమ డిఫెండెర్, బెస్ట్‌రైడర్ బహుమతులు సైతం అందించనున్నట్లు తెలిపారు. పేర్లు నమోదు చేసుకునేందుకు (ప్రదీప్–8897 103178),(శేఖర్– 970150 3712), (లడ్డు–7386 403816)నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

చెరుకు బండి కింద పడి బాలుడు మృతి

ఖేడ్ ఏరియా దవాఖాన వద్ద రోధిస్తున్న కుటుంబీకులు

నారాయణఖేడ్, జనవరి 11 : వలస బతుకులో విషాదం నెలకొన్నది. చెరుకు నరికే పనుల కోసం ఊరు గాని ఊరికి వెళ్లిన గిరిజన కుటుంబం ఆరేండ్ల చిన్నారిని కోల్పోయిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన వందలాది కుటుంబాలు ప్రతి ఏటా చెరుకు నరకడం, నరికిన చెరుకును ఎడ్లబండ్లపై కర్మాగారాలకు తరలించే పనుల కోసం ఆరు నెలల పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తుంటారు. ఇదే క్రమంలో నారాయణఖేడ్ మండలం గైరాన్ తండాకు చెందిన విజయ్ నాయక్, సుమిత్రాబాయి దంపతులు తమ ఆరేండ్ల కొడుకు నితిన్‌తో పాటు కర్ణాటకలోని బీదర్ జిల్లా శివరాంపూర్‌లో చెరుకు నరికే పనులు చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం నరికిన చెరుకును ఎడ్ల బండిలో నింపి తరలిస్తున్న క్రమంలో అక్కడే ఆడుకుంటున్న నితిన్ ప్రమాదవశాత్తు బండి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి వరకు కండ్లముందు ఆడుకున్న బాలుడు ఒక్కసారిగా విగతజీవుడు కావడంపై తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. బాలుడి మృతదేహాన్ని నారాయణఖేడ్ ఏరియా దవాఖానకు తరలించారు.

ఉచిత ఆన్‌లైన్ సేవలు

జిన్నారం (బొల్లారం) జనవరి 11 : జిన్నారం మండలం కాజీపల్లి గ్రామస్తులకు మాజీ సర్పంచ్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో సిటిజన్ ఆన్‌లైన్ సేవలను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ సేవలను ఆయన ప్రారంభించారు. మీసేవ నిర్వాహకులు దాదాపు 120 మంది గ్రామస్తులకు సంబంధించి ఆధార్ కార్డు దరఖాస్తులను స్వీకరించారు. ప్రతి ఒక్కరూ ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

మానసిక ఇబ్బందులతో ఆత్మహత్య

అందోల్, జనవరి 11: మానసిక పరిస్థితి సరిగాలేని వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు జోగిపేట ఎస్సై పాండు తెలిపారు. జోగిపేటకు చెందిన మర్రి రాజశేఖర్ (32)కొన్ని రోజులుగా మానసిక పరిస్థితి సరిగాలేక చికిత్సపొందుతున్నాడు. రోజూ మానసికంగా బాధపడుతూ శనివారం ఇంట్లో ఉరివేసుకున్నాడు. గమనించిన మృతుడి భార్య తలుపులు తీసి చూడగా, అప్పటికే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.